విద్యార్థులకు చద్దర్లు,స్వెటర్లు అందజేస్తున్న హరీశ్‌రావు

మెస్ బిల్లులేవి రేవంత్?

మొదటిపేజీ తరువాయి...

సీఎం రేవంత్ మాటలు కోటలు దాటుతున్నా చేతలు మాత్రం గడప దాటడం లేదని ఎద్దేవాచేశారు. చలికాలంలో వేడి నీళ్లు రాక, దుప్పట్లు లేక విద్యార్థులు హాస్టళ్లలో తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, ఈసారి ప్రభుత్వం దుప్పట్లు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ప్రభుత్వం తీరు చూస్తుంటే పరిపాలన మీద రేవంత్‌రెడ్డి పట్టు కోల్పోయినట్టు అనిపిస్తున్నదని చెప్పారు. అసెంబ్లీలో సీఎం చెప్పిన మాటలు కూడా అమలు కాకపోవడం దారుణమని, ఇది శాసనసభ గౌరవాన్ని తగ్గించడమేనని తెలిపారు.

సీఎం మాటలను అధికారులు వింటలేరా?

'ముఖ్యమంత్రి మాటలను అధికారులు వినడం లేదా?, లేక ఉత్త మాటలే చెప్పిన అని అధికారులకు సీఎం చెప్తున్నడా? సీఎం అంటే అధికారులకు భయం లేదా? విలువ లేదా? గౌరవం లేదా?' అని హరీశ్ అనుమానాలు వ్యక్తం చేశారు. తక్షణమే మెస్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అన్ని శాఖలను ముఖ్యమంత్రి తన వద్ద పెట్టుకొని ఎందుకు సమీక్ష చేయడం లేదని ప్రశ్నించారు. విద్యా శాఖకు మంత్రి లేడని, విద్యాశాఖతో పాటు సాంఘిక, గిరిజన, మైనార్టీ ఇలా అన్ని శాఖలూ సీఎం దగ్గరే ఉన్నాయని, ఇప్పటికైనా శాఖల పనితీరుపై సమీక్ష చేయాలని సూచించారు. ఎస్ఎస్ఏ నిధుల ద్వారా నడిచే అర్బన్ రెసిడెన్షియల్ బ్రిడ్జి పాఠశాలలకు కేంద్రం నిధులు మంజూరు చేసిందని, ఢిల్లీ పైసలిచ్చినా గల్లీలో పైసలు విడుదల చేయడం లేదని విమర్శించారు. రూ.1300 పెంచిన మెస్ బిల్లులు ఇప్పటికీ అమలు కాలేదని, అర్బన్ రెసిడెన్షియల్‌లో 1050 మెస్ బిల్లు ఇస్తున్నారని, 1 నుంచి 7 తరగతి వరకు 1300, 8వ తరగతికి 1500 ఇవ్వాలని, కాస్మోటిక్ బిల్లులు ఇంకా రూ.100 ఇస్తున్నారని, దాన్ని రూ.150 చేయాలని రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సీఎంనే సస్పెండ్ చేయాలి

1వ తేదీనే జీతాలని గొప్పలు చెప్పిన సీఎం, 10వ తేదీ వరకు ఉద్యోగులకు జీతాలు వేయడం లేదని హరీశ్ తెలిపారు. సస్పెండ్ చేయాల్సి వస్తే సీఎం రేవంత్‌రెడ్డినే సస్పెండ్ చేయాలని ఫైర్ అయ్యారు. పవనసుత యూత్ సభ్యులు విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయడాన్ని అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రవ్యాప్తంగా యువకులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హాస్టళ్లను దత్తత తీసుకొని పిల్లలకు సేవ చేయాలని కోరారు. నాయకులు, యువకులు ప్రభుత్వ హాస్టళ్లను దత్తత తీసుకుని విద్యార్థులకు దుప్పట్లు, స్వెట్టర్లు, ప్లేట్లు, బట్టలను పంపిణీ చేయాలని, డిసెంబర్ 31 దావత్‌లకు డబ్బులు వృథా చేయకుండా ప్రతి ఒక్కరూ తమ ప్రాంతంలోని హాస్టల్‌ను దత్తత తీసుకుని పిల్లలకు బట్టలు అందజేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు, వైస్ చైర్మన్ కనకరాజు, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, గుండు భూపేశ్, పాల సాయిరాం, మాజీ కౌన్సిలర్ జడేజా, పవనసుత యూత్ సభ్యులు కాముని నగేశ్, దొరగొల్ల శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, యాదగిరి, చంద్రం, నర్ర రవి, మండల రాజు, లింగం గౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీసీలకు 42% రిజర్వేషన్ ఇవ్వాల్సిందే

ఎమ్మెల్సీ మధుసూదనాచారి సత్యాగ్రహ దీక్షకు మద్దతు

హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలా పార్కు ఎదుట బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టిన నాయకులకు నిమ్మరసం ఇస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే నరేందర్

హనుమకొండ, డిసెంబర్ 28 : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేయాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు ఎదుట బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన సత్యాగ్రహ దీక్షకు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌తో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో అగ్రకులాలు తమకు రావాల్సిన వాటా కన్నా ఎక్కువ పొందుతున్నారని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఆశ చూపి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ ఆజాద్ యూత్ ఫెడరేషన్ నాయకులు మధుసూదనాచారికి కృతజ్ఞతలు తెలిపారు. దీక్ష చేస్తున్న నాయకులకు మధుసూదనాచారి నిమ్మరసం ఇచ్చి విరమింపజేశారు.

కవిత నాయకత్వంలోనే బీసీలకు న్యాయం

బీసీ కులాల రాష్ట్ర నాయకుడు హరిప్రసాద్

తెలంగాణచౌక్, డిసెంబర్ 28 : ఎమ్మెల్సీ కవిత నాయకత్వంలోనే బీసీలకు న్యాయం జరుగుతుందని బీసీ కులాల రాష్ట్ర నాయకుడు గుంజపడుగు హరిప్రసాద్ పేర్కొన్నారు. శనివారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో బీసీ సంఘాల మద్దతు చూసిన తరువాత కాంగ్రెస్ నాయకుల్లో ఆందోళన మొదలైందని అన్నారు. అందుకే అనాలోచితంగా కవితపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నేత, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కవితపై చేసిన వ్యాఖ్యలను యావత్ బీసీ సమాజం తీవ్రంగా ఖండిస్తుందని అన్నారు. రాష్ట్రంలో 130 బీసీ కులాలుంటే కవితతో జరిగిన సమావేశంలో 70 శాతం బీసీ కులాల వారు హాజరైనట్టు తెలిపారు. కవిత నాయకత్వంలో బీసీ ఉద్యమానికి సంపూర్ణ మద్దతును ప్రకటించినట్టు చెప్పారు. బీసీల నుంచి కవితకు వచ్చిన స్పందన చూసిన తర్వాతే కాంగ్రెస్ నాయకులు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కవిత బీసీ కాదని మాట్లాడే నాయకులు.. రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి బీసీ వర్గాలా? అని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ కవిత బీసీ సంక్షేమం కోసం ముందుకు వచ్చినట్టు తెలిపారు. 70 ఏండ్లకు పైగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్.. బీసీలకు న్యాయం చేయలేదని, కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలో బీసీ కులాలకు సంక్షేమం జరిగిందంటే అది కేవలం కేసీఆర్‌తోనే సాధ్యమైందని తెలిపారు. చేనేత, ముదిరాజ్, గొల్ల కుర్మలు, రజక, నాయీబ్రాహ్మణ కులాలకు కోట్లాది రూపాయలతో సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ కవితపై ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడితే బీసీలు తగిన బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న నరేశ్ కుమార్

బీసీలకు కవిత అండగా ఉంటే అవహేళనా?

- ఆది శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్యలు గర్హనీయం
- ఆయన బహిరంగ క్షమాపణ చెప్పాల్సిందే..
- యునైటెడ్ పూలే ఫ్రంట్ నేత నరేశ్‌కుమార్

ఖైరతాబాద్, డిసెంబర్ 28: బీసీలకు ఎమ్మెల్సీ కవిత అండ గా ఉంటానంటే అవహేళన చేస్తారా? బీసీ ల పోరాటానికి ఆమె మద్దతిస్తే వ్యతిరేకిస్తారా? ఆమె వైఖరిపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అనుచిత వ్యాఖ్య లు గర్హనీయం.. అని యునైటెడ్ పూలే ఫ్రంట్ నేత దుగుట్ల నరేశ్‌కుమార్ పేర్కొన్నారు. హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తక్షణమే ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ బహిరంగ క్షమాపణ చెప్పాలని, చిత్తశుద్ధి ఉంటే బీసీల సమస్యపై తమ పార్టీ అధిష్ఠానాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. మరోసారి ఎమ్మెల్సీ కవితపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. అధికారంలోకి వచ్చిన ఆర్నెళ్లలోనే కులగణన చేస్తామని, స్థానిక సంస్థల ఎన్నికలనాటికి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు కామారెడ్డి డిక్లరేషన్‌లో హామీ ఇచ్చిందని చెప్పారు. ఏడాది పూర్తయినా ఇంకా ఆ ప్రక్రియనే పూర్తి చేయలేదని విమర్శించారు. ఈ దశలో ఎమ్మెల్సీ కవిత బీసీల సమస్యలను లేవనెత్తుతూ, తమకు మద్దతుగా నిలిస్తే ఆమెను అవహేళన చేయ డం శోచనీయమని పేర్కొన్నారు. అన్ని కులాలు, వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై కవిత చట్టసభల్లో లేవనెత్తుతున్నారని, తెలంగాణలో ఏ వర్గం ప్రజలకు కష్టమొచ్చినా వారికి ఆమె అండగా నిలబడుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్ బీసీల సంక్షేమానికి అనేక పథకాలను తీసుకొచ్చిందని, అన్ని వృత్తులకు చేయూతనిచ్చిందని గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రాన్ని అత్యధిక కాలం పాలించిన కాంగ్రెస్, ఇతర ప్రభుత్వాల హయాంలో కేవలం 19 గురుకులాలను తీసుకొస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2,775 గురుకులాలను నెలకొల్పారని వివరించారు. దీని గురించి ఎందుకు మాట్లాడటం లేదని ఎమ్మెల్యే శ్రీనివాస్‌ను నరేశ్‌కుమార్ ప్రశ్నించారు. సమావేశంలో యూపీఎఫ్ నాయకులు విజయేంద్ర సాగర్, పెద్దాపురం కుమారస్వామి, జల్లా నరేందర్, ఎం.వెంకటేశ్ పాల్గొన్నారు.

28రోజులు గడిచినా వేతనాలేవి..?

ఇబ్బందుల్లో ఎయిడెడ్ అధ్యాపకులు

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తే తెలంగాణ): 'ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలిస్తున్నాం..' ఇది సర్కారోళ్లు చెప్పే మాటలు. కానీ ఒక టో తేదీ గడిచిపోయి 28 రోజులైనా రా ష్ట్రంలోని ఎయిడెడ్ అధ్యాపకులకు వేతనాలు అందని పరిస్థితి నెలకొన్నది. ఎ యిడెడ్ డిగ్రీ కాలేజీల్లో 500 మంది బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. వీరికి ఇంత వరకు నవంబర్ నె ల వేతనాలు అందలేదు. మరో మూడు రోజులైతే డిసెంబర్ వేతనం ఇవ్వాల్సి ఉంది. కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొన్నది. తక్షణమే వేతనాలు విడుదల చేయాలని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ భిక్షం డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న జాజుల

బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పష్టతనివ్వాలి

రిజర్వేషన్ల పెంపుపై కుట్రలు చేస్తే సహించేది లేదు: జాజుల

చిక్కడపల్లి, డిసెంబర్ 28 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై కొంతమంది కుట్రలు చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పష్టతనివ్వాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం దోమలగూడలోని బీసీ భవన్‌లో బీసీ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి వరకు జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనని ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకుల పేర్లను ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టినప్పటికీ అది పూర్తిస్థాయిలో జరుగలేదని, పట్టణ ప్రాంతాలు, హైదరాబాద్ నగరంలో చాలామంది సర్వే కోసం తమ ఇండ్లకు ప్రభుత్వ ఎన్యూమరేటర్లు రాలేదని పేర్కొన్నట్టు శ్రీనివాస్‌గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు. అధికారులు మాత్రం 98% సర్వే జరిగిందని తప్పుడు లెక్కలు చెబుతున్నారని, ఇది నమ్మి సీఎం రేవంత్‌రెడ్డి సైతం 98% పూర్తయ్యిందని ప్రకటించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు స్పష్టంచేశారు. రాష్ట్రంలో 100% సర్వేకు సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి, కన్వీనర్ బాలగోని బాలరాజుగౌడ్, వైస్ చైర్మన్ దీటి మల్లయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బీ మణిమంజరీసాగర్, నాయకులు జాజుల లింగంగౌడ్, మల్లికార్జున్‌నాయక్, శ్యామల, సంధ్యారాణి, వియజలక్ష్మి, విజయ్‌కుమార్‌గౌడ్, శంకరాచారి, గౌతమి పాల్గొన్నారు.

- రుణమాఫీ కోసం పోస్టుకార్డు ఉద్యమం

అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షలలోపు రుణమాఫీ చేయాలని కోరుతూ సీపీఎం అనుబంధ రైతు సంఘం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం తురకగూడెం గ్రామానికి చెందిన రైతులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డికి ఉత్తరాలు రాసి పోస్టు చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు చాలామంది రైతులకు రుణమాఫీ కాలేదని, వారందరికీ రుణమాఫీ వర్తించే విధంగా చూడాలని కోరారు. – కూసుమంచి

- బతుకమ్మలతో సీఆర్టీల నిరసన

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంక్షేమ శాఖలో పనిచేసే కాంట్రాక్టు గురుకుల టీచర్లు (సీఆర్టీలు) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం ఐటీడీఏ ఎదుట చేపట్టిన దీక్ష శనివారం తొమ్మిదో రోజుకు చేరుకున్నది. ఈ సందర్భంగా బతుకమ్మలతో నిరసన తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయం ఎదుట సీఆర్టీలు చేపట్టిన రిలే దీక్షకు ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఆదిలాబాద్ జడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ మద్దతు తెలిపారు. అనంతరం సీఆర్టీలకు ఎమ్మెల్యే కోవ లక్ష్మి రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. – భద్రాచలం, ఉట్నూరు

- జీతాలు రాకుంటే బతికేదెట్టా?

ఏడు నెలల పెండింగ్ వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం పంచాయతీ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు చేపట్టారు. జనగామ కలెక్టరేట్ ఎదుట పంచాయతీ సిబ్బంది ధర్నా నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా బోధన్, డిచ్‌పల్లి, రుద్రూర్, కోటగిరి, ఎడపల్లి తదితర మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల ఎదుట బైఠాయించారు. పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని కలెక్టరేట్ ఎదుట ర్యాలీ చేశారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెనలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట రెండో రోజు సమ్మె కొనసాగింది. కార్మికులు హైవేపై రాస్తారోకో నిర్వహించారు. ఖమ్మం జిల్లావ్యాప్తంగా సమ్మె కొనసాగింది. – నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్

మా టీచర్ల సమస్యలు పరిష్కరించండి..

- రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీ స్కూళ్ల విద్యార్థినుల నిరసనలు
- 18 రోజులుగా చదువులు సాగడం లేదని ఆవేదన

కామారెడ్డి జిల్లా బిచ్కుందలోని కేజీబీవీలో ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబర్ 28: సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తమ టీచర్లు 18 రోజులుగా సమ్మె చేస్తున్నారని, ఫలితంగా తమకు పాఠాలు బోధించే వారే లేకుండా పోయారంటూ కేజీబీవీ విద్యార్థినులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ టీచర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి.. తమ చదువులు ముందుకు సాగేలా చూడాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ మేరకు విద్యార్థినులు కస్తుర్బా గాంధీ బాలికల విద్యాలయాల ఎదుట శనివారం ఆందోళనలు చేపట్టారు. మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండల కేంద్రంలోని కేజీబీవీ ఎదుట విద్యార్థినులు బైఠాయించారు. తాత్కాలికంగా టీచర్లను నియమించి అధికారులు చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. సబ్జెక్టు టీచర్లు లేక, వచ్చిన టీచర్లు సెల్‌ఫోన్లకే పరిమితమవుతూ తరగతులు బోధించడం లేదని వారు ఎంఈవో రవికుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని కేజీబీవీ ఎదుట విద్యార్థినులు ప్లకార్డులతో మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. వార్షిక పరీక్షలు దగ్గరపడుతున్నా సిలబస్ పూర్తి కాలేదని, ఇంటర్ ప్రాక్టికల్స్ ఎలా చేయాలో అర్థం కావడం లేదన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో కేజీబీవీ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఎస్సై తిరుపాజీ, ఎంఈవో శంకర్ అక్కడికి వచ్చి విద్యార్థినులకు నచ్చజెప్పే యత్నం చేశారు. వారు వినకపోవడంతో స్కూల్ కాంప్లెక్స్ నుంచి బోధనా సిబ్బంది ఏర్పాటు చేసినట్టు చెప్పడంతో ఆందోళన విరమించారు. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం కల్లూరు, ఇబ్రహీంపట్నం, మల్యాల మండల కేంద్రాల్లోని కేజీబీవీల్లో విద్యార్థులు ఆందోళనకు దిగారు. కల్లూరులోని పాఠశాలలకు వెళ్లిన మహిళా ఉపాధ్యాయులను అడ్డుకొని ప్రధాన ద్వారాన్ని మూసివేసి నిరసన తెలిపారు. డిప్యూటేషన్‌పై వచ్చిన వారు తమకు అవసరం లేదని స్పష్టం చేశారు. తమ ఉపాధ్యాయులే కావాలని కొందరు కన్నీళ్లు పెట్టుకున్నారు. కామారెడ్డి జిల్లా గాంధారి, బిచ్కుందలో గల కేజీబీవీ విద్యార్థినులు పాఠశాల ఎదుట బైఠాయించారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం బక్కమంతులగూడెం గ్రామంలోని కేజీబీవీ పరిశీలనకు వచ్చిన ఎంఈవో వెంకటాచారి ఎదుట విద్యార్థినులు నిరసన తెలిపారు.

ఆదిలాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలుపుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

18వ రోజుకు చేరిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

నమస్తే తెలంగాణ న్యూస్‌నెట్‌వర్క్, డిసెంబర్ 28 :సీఎం రేవంత్‌రెడ్డి తమకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు 18 రోజులుగా సమ్మె కొనసాగిస్తున్నారు. శనివారం సూర్యాపేటలోని ప్రధాన వీధుల గుండా కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ తీశారు. నల్లగొండ, యాదాద్రి భువనగిరి కలెక్టరేట్ల ఎదుట ఉద్యోగులు గాంధీ టోపీలు ధరించి నిరసన తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని ధర్నా చౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ చిత్రంతో కూడిన మాస్క్‌లు ధరించి ఉద్యోగులు నిరసన తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ వద్ద 18 రోజులుగా సమ్మె చేస్తున్న ఉద్యోగులు శనివారం రోడ్డు పక్కనే కూర్చొని భోజనాలు చేశారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా ఉద్యోగులు శనివారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. వీరి సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించిన సందర్భంగా బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చకపోవడంతోనే ఉద్యోగులు రోడ్డెక్కాల్సి వచ్చిందని విమర్శించారు. అనంతరం ఉద్యోగులకు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు.

పంచాయతీ కార్మికుల పోరుబాట

- రాష్ట్రవ్యాప్తంగా రెండోరోజూ టోకెన్ సమ్మె
- సర్కారు స్పందించకుంటే జనవరి 4 తర్వాత
- ఏరోజైనా నిరవధిక సమ్మెకు సిద్ధమని ప్రకటన

హైదరాబాద్, డిసెంబర్ 28 (నమస్తేతెలంగాణ): తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు పోరుబాట పట్టారు. శుక్ర, శనివారాల్లో సుమారు 60 వేల మంది ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా టోకెన్ సమ్మె చేపట్టారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ తదితర కార్మిక సంఘాలు జేఏసీగా ఏర్పడి ఆందోళనకు దిగారు. కలెక్టరేట్ల ఎదుట ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. డీపీవో, ఎంపీడీవోలకు వినతిపత్రాలు సమర్పించారు. ప్రభుత్వం దిగిరాకుంటే జనవరి 4 తర్వాత ఏరోజైనా నిరవధిక సమ్మెకు సిద్ధమని ప్రకటించారు. శనివారం సమ్మె సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. మల్టీపర్పస్ పని విధానానికి సంబంధించిన జీవో-51 రద్దుచేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

నల్లగొండలో టీఎస్ యూటీఎఫ్ మహాసభల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, వేదికపై మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జూలకంటి

ఉపాధ్యాయ సమస్యలపై పోరాటం

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల ప్రారంభంలో వక్తలు
- నల్లగొండ పట్టణంలో ఉపాధ్యాయుల భారీ ప్రదర్శన
- మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్సీలు నర్సిరెడ్డి, కోటిరెడ్డి హాజరు

రామగిరి, డిసెంబర్ 28 : ఉపాధ్యాయుల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని వక్తలు పిలుపునిచ్చారు. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర 6వ విద్యా వైజ్ఞానిక మహాసభలు నల్లగొండ జిల్లా కేంద్రంలో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గడియారం సెంటర్ నుంచి లక్ష్మి గార్డెన్స్ వరకు మహాప్రదర్శన నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ర్యాలీని ప్రారంభించారు. టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య ప్రారంభోపన్యాసం చేశారు. ముఖ్య అతిథిగా శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఏపీ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్క శ్రీనివాస్, ఎస్‌టీఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షురాలు సంయుక్త, టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ రావు, జేఎన్‌యూ పూర్వ అధ్యక్షురాలు అయిషీఘోష్ తదితరులు ప్రసంగించారు. కామన్ సర్వీస్ రూల్స్ అమలు చేసినప్పుడే విద్యారంగ సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ పాటలతో అలరించారు.

- సీసీఐ పత్తి కొనాలని ఆందోళన

మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలం కిష్టంపేటలోని ఆదిశంకరాచార్య మిల్లులో పత్తి కొనుగోలు చేపట్టాలని కోరుతూ చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిపై శనివారం రైతులు ధర్నా చేపట్టారు. మిల్లులో 2 రోజులుగా సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టడం లేదని, అడిగితే ప్రైవేట్‌లో అమ్ముకోవాలని నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని రైతులు మండిపడ్డారు. ఎస్ఐ సుబ్బారావు, మార్కెట్ సెక్రటరీ రామాంజనేయులు చేరుకొని రైతులకు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. – చెన్నూర్ రూరల్

- బేలలో రాస్తారోకో..

సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు చేపట్టాలని డిమాండ్ చేస్తూ శనివారం ఆదిలాబాద్ జిల్లా బేల మండల కేంద్రంలోని అషాపుర జిన్నింగ్ మిల్లు వద్ద రైతులు రాస్తారోకో చేశారు. బేల ఎస్ఐ దివ్య భారతి, తహసీల్దార్ రఘునాథ్‌రావు చేరుకొని రైతులతో మాట్లాడి, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సీసీఐ అధికారులతో మాట్లాడి పత్తి కొనుగోళ్లు చేపడుతామని కలెక్టర్ చెప్పడంతో రైతులు శాంతించారు. – బేల